ఎక్కడో అమరావతి, ఢిల్లీల్లో కూర్చున్న ఎన్నికల కమిషన్ అధికారులకున్న ముందు చూపు కూడా స్థానికంగా వున్న అధికారులకు లేకపోయిందన్న అపవాదును జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం ఎదుర్కొంటున్నాయి. దాన్ని నిజం చేస్తూ పోలింగ్ రోజు, తర్వాత రోజు ఘటనలను అంచనా వేయడంలోనూ, ముందస్తు చర్యలు తీసుకోవడంలోనూ ప్రత్యేకించి పోలీసు యంత్రాంగం విఫలమైనట్టు స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రగిరి నియోజకవర్గంలో సంభవించిన రాజకీయ హింసాత్మక ఘటనల వెనుక ప్రధానంగా పోలీసు యంత్రాంగం వైఫల్యమే కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


ఈవీఎంల స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేసిన మహిళా వర్శిటీ వద్ద మంగళవారం సాయంత్రం గంటలకొద్దీ కొనసాగిన ఉద్రిక్త వాతావరణం

సున్నిత ప్రాంతాలపై కొరవడిన నిఘా

పోలీసు వైఫల్యంతోనే హింసాత్మక ఘటనలు!

ముందస్తు అంచనాలు, జాగ్రత్తల్లో నిర్లక్ష్యం

ఘర్షణలు జరిగాకైనా మేలుకోని వైనం

ఈసీకి వున్న ముందు చూపు జిల్లా యంత్రాంగానికేదీ?

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో పరిస్థితులు సజావుగా లేవని ఎన్నికల కమిషన్ ఎప్పుడో గ్రహించింది. దానికి తగ్గట్టుగా అనేక చర్యలు తీసుకుంది. అందులో భాగమే వంద శాతం వెబ్ కాస్టింగ్. అలాగే కేంద్ర బలగాల మొహరింపు. వాస్తవానికి జిల్లా యంత్రాంగం చంద్రగిరిలోని 397 పోలింగ్ కేంద్రాల్లో 202 సమస్యాత్మకమని, 15 తీవ్ర సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. అలాగే తిరుపతిలో 274 పోలింగ్ కేంద్రాలకు గానూ 86 సమస్యాత్మకమని ప్రతిపాదించాయి. శాంతిభద్రతల పర్యవేక్షణకు వచ్చిన కేంద్ర పరిశీలకుడు ఈ రెండు నియోజకవర్గాలపై వచ్చిన ఫిర్యాదులను, ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని వంద శాతం వెబ్ కాస్టింగ్‌తో పాటు కేంద్ర బలగాల నియామకానికి సిఫారసు చేశారు. ఈసీ సైతం దాన్ని ఆమోదించింది. ఈ నిర్ణయం వెనుకున్న స్ఫూర్తిని జిల్లా యంత్రాంగం యధాతధంగా స్వీకరించలేదన్న ఆరోపణలున్నాయి.

బ్రాహ్మణ కాలవ ఘటనే ఉదాహరణ

రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ టీడీపీకి పట్టున్న గ్రామం. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లు బయటి నుంచీ రావాల్సిందే. ఎక్కడైనా ఒక పార్టీకి గట్టి బలమున్న చోట ప్రత్యర్థి పార్టీల ఏజెంట్లకు రక్షణ వుండదు. అలాంటి చోట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తేనే బలహీనంగా వున్న వర్గంపై బలమైన వర్గం ఆధిపత్యం చెలాయించకుండా వుంటుంది. అక్కడ వైసీపీ ఏజెంట్లపై దౌర్జన్యం జరిగిందని ప్రచారం జరగడంతో వైసీపీ అభ్యర్థి భారీగా అనుచరులను వెంటబెట్టుకుని గ్రామానికి వెళ్ళడం, దాంతో గ్రామస్తులు ఆగ్రహంతో రెచ్చిపోవడం జరిగాయి. ఈ ఉద్రిక్తతలే గాల్లోకి కాల్పులు జరపడానికి దారి తీశాయి. ఇక్కడ గత ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై దాడి జరిగినంత పనైంది. ఇలాంటి చరిత్ర వున్న పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు తగిన విధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలున్నాయి.

రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలతోనూ మేలుకోని వైనం

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు రాత్రి దాడులు, ప్రతిదాడులతో భయానక వాతావరణం నెలకొంది. వైసీపీ వర్గీయుల దాడిలో పదిమంది గాయపడగా, ప్రతిదాడిలో వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు వాహనాలు తగులబడ్డాయి. బ్రాహ్మణకాలవతో పాటు ఈ రెండు గ్రామాలకు కూడా వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి స్వయంగా వెళ్ళారు. అధికార పార్టీ అభ్యర్థి మందీ మార్బలంతో వెళ్ళడం వల్లే మూడుచోట్లా ఉద్రిక్తతలు పెరిగాయన్న ఆరోపణలున్నాయి. కనీసం అప్పుడైనా పోలీసు యంత్రాంగం మేలుకొని పరిస్థితులు అదుపులోకి వచ్చేదాకా వైసీపీ అభ్యర్థిని గృహ నిర్బంధంలో వుంచాల్సింది. అది కూడా చేయలేదు. వైసీపీ దాడులకు టీడీపీ నుంచీ ప్రతిదాడులుంటాయన్న ప్రాథమిక అంచనా కూడా పోలీసు యంత్రాంగానికి లేకపోవడం గమనార్హం. ఇరు పార్టీల అభ్యర్థులకూ షాడో పార్టీలు వేయాలన్న ఆలోచన కూడా చేయలేదు.

నానీపై దాడి పోలీసు వైఫల్యానికి నిదర్శనం

మహిళా వర్శిటీ ఆవరణలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ వర్గీయులు జరిపిన దాడి పోలీసు వైఫల్యానికి పరాకాష్టగా చెప్పాలి. మహిళా వర్శిటీలో విద్యార్థినులు, వర్శిటీ ఉద్యోగులు తప్ప ఇతరులు ప్రవేశించే అవకాశమే లేదు. అందునా వర్శిటీ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వర్శిటీ ఆవరణలోకి ప్రవేశ ద్వారాలు రెండు వుండగా రెండు చోట్లా ప్రాథమిక తనిఖీల తర్వాతే లోనికి అనుమతి లభించాలి. కానీ మంగళవారం రోజు ఇవేమీ కనిపించలేదు. మారణాయుధాలు ధరించిన వైసీపీ వర్గీయులు యధేచ్ఛగా వర్శిటీ ఆవరణలోకి వెళ్ళి నానీపై దాడికి దిగి ఆయనను, గన్‌మ్యాన్‌ను గాయపరిచారు. వాహనాలు ధ్వంసం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లున్న వర్శిటీ ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానం చేయకపోవడమే ఆశ్చర్యంగా వుంది.

దాడి పర్యవసానాలను అదుపు చేయలేకపోయిన యంత్రాంగం

నానీపై దాడి జరిగిన అరగంట వ్యవధిలో చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా కనీసం ఐదారు వందలమంది కార్యకర్తలు వర్శిటీ వద్దకు చేరుకుని ప్రతిదాడులకు దిగారు. దాన్ని అంచనా వేసి అదుపు చేయడంలో కూడా పోలీసు యంత్రాంగం దారుణంగా విఫలమైంది. కేంద్ర బలగాలు తిరుపతిలోనే వున్నా కూడా సకాలంలో వర్శిటీ వద్దకు రప్పించలేని దుస్థితిలో అధికారులు వుండిపోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిపై మారణాయుధాలతో స్ట్రాంగ్ రూములున్న వర్శిటీ ఆవరణలో హత్యాయత్నం జరిగినా రెండున్నర గంటల తర్వాత గానీ ఎస్పీ అక్కడికి రాలేదు.

144 సెక్షన్ పొడిగించాల్సింది ఎపుడు?

పోలింగ్‌ను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ సాయంత్రం నుంచీ పోలింగ్ రోజు సాయంత్రం వరకూ సీఆర్‌పీసీ సెక్షన్ 144 విధిస్తున్నట్టు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ 11వ తేదీ ప్రకటించారు. అయితే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి ఘటనలు పోలింగ్ రోజే జరిగాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని అయినా కనీసం చంద్రగిరి నియోజకవర్గంలోనూ, దానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములున్న మహిళా వర్శిటీ ప్రాంతంలోనూ 144 సెక్షన్ అమలును పొడిగించి వుండాల్సింది. అధికారులు ఆ జాగ్రత్త కూడా పాటించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. జరగాల్సిందంతా జరిగాక ఆలస్యంగా మేలుకొని మంగళవారం సాయంత్రం పొడిగిస్తున్నట్టు ప్రకటించారు.

స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగాలు ఏం చేస్తున్నట్టు?

జిల్లాలో పోలీసు శాఖకు అనుబంధంగా స్పెషల్ బ్రాంచి పనిచేస్తుంది. ఈ విభాగం ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఘర్షణాత్మక పరిస్థితులున్నపుడు ప్రధాన పార్టీల నేతల కదలికలను, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి ఎస్పీని హెచ్చరించాలి. కానీ అలాంటిదేమీ నాలుగు ఘటనల్లో జరగలేదు. స్వతంత్రంగా పనిచేసే ఇంటెలిజెన్స్ విభాగంతో కూడా జిల్లా ఎస్పీ సమన్వయంతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవాల్సి వుంటుంది. ఆ విభాగం పనితీరు కూడా ఈ సందర్భంగా ప్రశ్నార్థకమవుతోంది.

స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థల ఎంపికపై విమర్శలు

ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయడమే సరైంది కాదన్న వాదన వినిపిస్తోంది. పద్మావతీ వర్శిటీ విశాలమైంది, అనువైన భవనాలు కలిగివున్నదీ అయినప్పటికీ ఇతర అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. వర్శిటీ ప్రహరీ ఆనుకునే తుమ్మలగుంట గ్రామం వుంది. అది వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి స్వస్థలం. వారికి అక్కడ గట్టి పట్టుంది. పది నిమిషాల వ్యవధిలో వెయ్యిమందిని పోగేసే పరిస్థితి వుంది. అలాగే వర్శిటీకి చేరువగానే టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ నివాసం వుంటున్నారు. ఆయనకూ స్థానికంగా ప్రాబల్యం వుంది. ఒక్క పిలుపుతో స్వల్ప వ్యవధిలో వెయ్యిమందిని రప్పించే జనబలముంది. ఉద్రిక్తతలు రాజ్యమేలే ఈ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ను పద్మావతీ వర్శిటీలో కాకుండా మరో చోట మరింత భద్రతతో ఏర్పాటు చేసి వుండాల్సిందన్న వాదన వుంది.

నానీ గన్‌మ్యాన్ దుండగులపై కాల్పులు జరిపివుంటే?

పద్మావతీ వర్శిటీ ఆవరణలో మంగళవారం నానీపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేసినపుడు ఆయన గన్‌మ్యాన్ ధరణి నిబంధనలు పాటించారు. తొలుత గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే వెనక్కి తగ్గని వైసీపీ వర్గీయులు నేరుగా గన్‌మ్యాన్‌పైనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలా కాకుండా గన్‌మ్యాన్ నేరుగా దాడి చేసిన వారిపై కాల్పులు జరిపివుంటే ఎన్ని మరణాలు సంభవించివుండేవి? తర్వాత పర్యవసానాలు ఎలా వుండేవి? అన్న ప్రశ్నలకు సమాధానాల్లేవు.

చంద్రగిరి ఆర్వో ఏమి చేస్తున్నారు?

జిల్లా మొత్తం మీద చంద్రగిరి నియోజకవర్గం సమస్యాత్మకం. ఈ విషయం అటు పోలీసు రికార్డులు, ఇటు ఎన్నికల రికార్డులూ వెల్లడిస్తున్నాయి. ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా తిరుపతి ఆర్డీవో వ్యవహరిస్తున్నారు.నియోజకవర్గ పరిస్థితులకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవడం, జిల్లా యంత్రాంగానికి ముందస్తు అంచనా నివేదికలు అందజేయడం ఆ అధికారి బాధ్యత. పోలింగ్ రోజు ఘటనలను బట్టి పోలీసు అధికారులతో సమీక్షించడం, ఘర్షణల పర్యవసానాలను అంచనా వేయడం, తదనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవడం కూడా ఆ అధికారి బాధ్యత. అయితే చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఆర్వో ప్రేక్షకపాత్ర పోషించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నామినేషన్ల దాఖలు సందర్భంగా కూడా ఆర్వో కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడడం, పోలీసులు లాఠీఛార్జి జరపాల్సి రావడం, ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి జరగడం తెలిసిందే. అప్పట్లో కూడా ఆర్వోరి సరైన చర్యలు, ముందు జాగ్రత్తలు తీసుకోలేదని, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదన్న ఆరోపణలు వచ్చాయి.

పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇప్పటికీ పలు గ్రామాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన హత్యాయత్నానికి ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం లేకపోలేదు. ఇరువైపులా అభ్యర్థులకు ప్రమాదం వెన్నంటే వుంది. అనుచర గణం, గన్‌మెన్ లేకుండా ఇరువురూ స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ప్రమాదం వారి కుటుంబ సభ్యులకు కూడా పొంచి వుంది. అలాగే బ్రాహ్మణ కాలవ, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి, పద్మావతీ వర్శిటీ ఘటనలకు సంబంధించిన కేసుల్లో జరిగే అరెస్టులు కూడా ఆయా గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించనున్నాయి. కఠినంగా వ్యవహరించని పక్షంలో ప్రతీకార దాడులు జరిగే అవకాశాలున్నాయి.

నానీపై హత్యాయత్నం చేయించిందెవరు?

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన హత్యాయత్నం వెనుక వున్న కీలక వ్యక్తులు ఎవరో ఇప్పటికే వెల్లడైంది. రామచంద్రాపురం మండలానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకులు వల్లేటి భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి ఈ దాడిలో కీలకంగా పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. వారితో పాటు వారి అనుచరులు పాల్గొన్నట్టు వీడియో ఫుటేజీలు కూడా పోలీసులకు లభ్యమయ్యాయి. అయితే వారితో దాడి చేయించింది ఎవరన్నది ప్రశ్నగా మారింది. ఏ కారణాలతో వారు మారణాయుధాలతో దాడికి దిగారు? ఎవరి కోసం అంత రిస్కు తీసుకున్నారు? దాడి వెనుక ముందస్తు ప్రణాళిక వుందా? దాడికి పాల్పడిన వారికి భారీగా లబ్ది చేకూరే ప్యాకేజీ వంటిదేమైనా వుందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి వుంది.

స్విమ్స్ నుంచి నానీ డిశ్చార్జి

నానీకి నారాయణ పరామర్శ



తిరుపతి(వైద్యం), మే 15 : వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని బుధవారం డిశ్చార్జి చేశారు. భుజంపై తగిలిన గాయం ఇంకా పూర్తిగా నయం కాలేదని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు ఆయనకు సూచించారు. నానీ డిశ్చార్జి సమాచారంతో పలువురు టీడీపీ శ్రేణులు ఉదయం నుంచే స్విమ్స్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఇంటివద్ద నానీని వందలాదిమంది టీడీపీ శ్రేణులతో పాటు సీపీఐ నేత నారాయణ, సినీ నటుడు శివాజీ తదితర ప్రముఖులు పరామర్శించారు.

నానీపై హత్యాయత్నం కేసులో ఐదుగురు అదుపులోకి

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, మే 15 : చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు బుధవారం ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.ప్రధాన నిందితులుగా గుర్తించిన రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. దాడికి పాల్పడిన వారందరూ లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటి ఇంటి వద్ద సెంట్రింగ్ పనివారుగా గుర్తించినట్లు సమాచారం. తిరుపతి, రామచంద్రాపురం పోలీసులు బుధవారం అనుపల్లిలో 12మందిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తిరుపతికి తరలించారు.వారిలో ఎనిమిది మందిని విడిచిపెట్టి నలుగురిని విచారిస్తున్నట్లు సమాచారం. కాగా మహిళావర్శిటీ వద్ద మంగళవారం అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనకు సంబంధించి దాదాపు 10 మందిని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. వారి కోసం గాలిస్తున్నారు.

చెవిరెడ్డి రాకతో ఎంఆర్‌పల్లి స్టేషన్ వద్ద ఉద్రిక్తత

తిరుపతి(నేరవిభాగం), మే 15 : టీడీపీ అభ్యర్థి నానీపై హత్యాయత్నం కేసులో ఎంఆర్‌పల్లి పోలీసులు కొంతమంది వైసీపీ కార్యకర్తలను బుధవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు.అయితే కేసులో ఐదుగురి పేర్లు చూపించి 11 మందిని ఎందుకు తీసుకొచ్చారంటూ ప్రశ్నించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైసీపీ అభ్యర్థి మోహిత్ రెడ్డి బుధవారం రాత్రి హుటాహుటిన ఎంఆర్ పల్లి స్టేషన్ వద్దకు చేరుకున్నారు.అక్కడ భారీఎత్తున పోలీసులను మొహరింపజేయడంతో స్టేషన్ వద్ద పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. దాదాపు గంట తరువాత చెవిరెడ్డికి ఏఎస్పీ కులశేఖర్ సర్ది చెప్పగా వారక్కడినుంచీ వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





పుట్టమన్ను సేకరణ - సేనాధిపతి ఊరేగింపు

తిరుపతి(కల్చరల్), మే 15: తిరుపతిలోని గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా బుధవారం అంకురార్పణ జరిగింది. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య అర్చక స్వాములు, వేదపండితులు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం ఉదయం 8.15 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి.డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో చిరుత సంచారం



తిరుమల, మే15(ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో చిరుతపులి సంచారం మరోసారి కలకలం సృష్టించింది. ఈ నెల 12వ తేదీ వేకువజామున 5 గంటల సమయంలో శ్రీవారి దర్శనార్థం ఓ భక్తబృందం కారులో వెళుతుండగా మార్గమధ్యంలో ఓ చిరుత రోడ్డు దాటింది. దీంతో కారులోని భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై వేగంగా తిరుమల చేరుకున్నారు. అయితే కారు డ్యాష్ కెమెరాలో రికార్డయిన వీడియోను ఆ భక్త బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.ప్రస్తుతం ఆ వీడియో నెటింట్లో వైరల్‌గా మారింది.

శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా ఎల్లుండి విడుదల

తిరుమల, మే15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను టీటీడీ ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు మే 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన భక్తులు అదే రోజు మధ్యాహ్నం 12 గంటల లోపు టికెట్ ధర చెల్లించి లక్కీడిప్ టికెట్‌ను పొందవచ్చు.కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవాటికెట్ల కోటా, అలాగే శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాల సేవా టికెట్ల కోటాను మే21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లను కూడా విడుదల చేస్తారు. భక్తులు వీటి కోసం టీటీడీ అధికార వెబ్‌సైట్ 'టీటీడీదేవస్థానమ్స్'ను సంప్రదించాల్సి ఉంటుంది.

నేటినుంచి ఈఏపీసెట్

- హాజరుకానున్న 28,390మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 15: ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చరల్ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షలు ఈనెల 23 వరకు జరుగుతాయి. తిరుపతి, పుత్తూరు, గూడూరుప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరుపతి కేంద్రంగా అత్యధికంగా 18,214 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పుత్తూరు కేంద్రంగా 4,062 మంది, గూడూరు కేంద్రంగా 6,114 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తం 28,390 మంది విద్యార్థులు ఈఏపీసెట్‌కు హాజరుకానున్నారు. 16, 17 తేదీల్లో బైపీసీ విద్యార్థులకు సంబంధించి ఏజీ బీఎస్సీ, బీఎస్సీ, బీఫార్మసీ, ఫిజియోథెరపీ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు జరుగనున్నాయి. 5,539 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. 18 నుంచి 23వ తేదీ వరకు ఎంపీసీ విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశానికి పరీక్షలు జరుగనున్నాయి. 22,735 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఎంబైపీసీ చదివిన విద్యార్థులు 116 మంది విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చరల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు రాయనున్నారు.



బైరాగి వేషంలో
భక్తుల కోలాహలం

తిరుపతి(కల్చరల్) మే 15: తిరుపతి గంగమ్మ జాతర తొలి రోజు బుధవారం భక్తులు బైరాగివేషంలో (చాటింపు వేషం) మొక్కులు తీర్చుకున్నారు. శరీరమంతా విబూధి పూసు కున్నారు. నల్లని చుక్కలతో అలంకరించుకుని నడుముకు వేపమం డలు ధరించి ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం తిరుపతి శాసనసభ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీని వాసులు, కార్పొరేషన్ 53 డివి జన్ కార్పొరేటర్ ఆర్.సి మునికృష్ణ దంపతులు వేయికళ్ల దుత్తలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రావాలని, తిరుప తిలో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్లు మునికృష్ణ మీడియాకు తెలిపారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కళాకారులు వివిధ పౌరాణిక వేషాలతో అమ్మవారి ఆలయం చేరుకున్నారు. వీరంతా మొక్కులు చెల్లించుకున్నారు. తొలి రోజు కావ డంతో చిన్నారులు బైరాగి వేషంలో సందడి చేశారు. సాయంత్రం పలు కూడ ళ్లలో పందిళ్లు వేసి, గంగమ్మ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిని టీటీడీ పాలక మండలి అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ప్రారంభించారు. గురువారం అమ్మవారి భక్తులు బండవేషంలో మొక్కులు తీర్చుకుంటారు.



వేశాలమ్మ

























ప్రహరీ నిర్మాణంపై ఆర్టీసీ అలసత్వం

● విలువైన విడిభాగాలకు భద్రత కరువు



మంగళం ఆర్టీసీ డిపో ప్రహరీ కూలిపోవడంతో ముళ్లకంపలతో కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

మంగళం, మే 15: మంగళం పరిధిలోని ఆర్టీసీ డిపో ప్రహరీ గోడలు కూలి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మంగళం ఆర్టీసీ డిపోకు తొమ్మిదేళ్ల క్రితం భారీ ప్రహరీ గోడ నిర్మించారు. గత ఏడాది ఆగస్టులో వర్షానికి దక్షిణం వైపు గోడ 100 అడుగుల మేర కుప్ప కూలిపోయింది. వెంటనే పటిష్ఠమైన చర్యలు చేపడుతామని అధికారులు అప్పట్లో తెలిపారు. తరువాత ఆ సంగతే మరచిపోయారు. గతేడాది నవం బరులో మళ్లీ కురిసిన వర్షానికి తూర్పు వైపు ప్రహరీ గోడ కూడా వంద అడుగుల మేర కూలిపోయింది. నిర్మాణంలో నాణ్యత కొరవడినందునే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంజనీ రింగ్ విభాగానికి లేఖరాశామని, త్వరలో కూలిన ప్రదేశంలో కొత్త గోడల నిర్మాణం చేపడతారని డిపో మేనేజరు తెలిపారు. అయినా ఇప్పటివరకూ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోలేదు. బస్సుల మరమ్మతులకు ఉపయో గించే విలువైన విడిభాగాల రక్షణ గాలికి వదిలేశారు. ప్రస్తుతం దక్షిణం వైపు పట్టలు, తూర్పు వైపు ముళ్లకంపలను అడ్డుపెట్టి ఉంచారు.

ఎన్ఎస్‌యూలో సంస్కృత శిక్షణా శిబిరం ప్రారంభం



ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తదితరులు

తిరుపతి రూరల్, మే 15: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్శిటీలోని చెలికాని అన్నారావు సభాభవనంలో ఉచిత వేసవి సంస్కృత శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఏపీ సంస్కృతభారతి, వర్శిటీ సంయుక్త ఆధ్వ ర్యంలో ఏర్పాటు ఈ శిబిరాన్ని ముఖ్యఅతిథిగా వచ్చిన సంస్కృతభారతి మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకరశర్మతో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్ కలసి ప్రారంభించారు. ప్రభాకరశర్మ మాట్లాడుతూ.. సంస్కృతభాష ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు సంస్కృతభారతి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని వివరిం చారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ చిన్నారులకు సంస్కృతభాషపై అభిరు చిని పెంచేందుకు బాలానంద, సంస్కృత సంభాషణ శిబిరాలను ఏటా వేసవి కాలంలో వర్శిటీ తరపున నిర్వహిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈసందర్భంగా రామాయణ ఒలింపియాడ్ పోస్టర్‌ని ఆవి ష్కరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ, డాక్టర్ ఎస్ఎల్ సీతారామ శర్మ, డాక్టర్ ఎంజీ నందనరావు, డాక్టర్ కుమార్‌బాగే వాడిమర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో కొనసాగుతున్న టెన్షన్

తిరుపతి(నేరవిభాగం), మే 15 : చంద్రగిరిలో ఉద్రిక్త వాతావరణం కొన సాగుతోంది.గొడవలు చోటు చేసుకున్న పులివర్తివారి పల్లి, కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, తిరుచానూరు ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పికెట్లు ఏర్పాటు చేశారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నాని, గన్‌మ్యాన్ ధరణి బుధవారం సాయంత్రం డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా వుండేందుకు 144 సెక్షన్ అమలు చేయ డంతో పాటు కేంద్ర బలగాలతో పికెట్లు ఏర్పాటు చేశారు.దాడి ఘటనపై ఎన్నికల కమిషన్ సీరియస్ కావడంతో పోలీసులు మరింత అప్రమత్తమ య్యారు. వీలైనంత తొందరగా అసలు నిందితులను పట్టుకోవాలని ప్రయత్ని స్తున్నారు.

కూచువారిపల్లె ఘటనలో ఇరువర్గాలపై కేసు

చంద్రగిరి, మే 15: చంద్రగిరి మండలం, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని కూచువారిపల్లెలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న వైసీపీ, టీడీపీ వర్గీ యుల పరస్పర దాడులపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు కూచువారిపల్లెలో సోమవారం రాత్రి వైసీపీ శ్రేణులు గ్రామస్తులపై దాడి చేయగా అనంతరం టీడీపీ నాయకులు వైసీపీ నేత కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని దగ్ధం చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సుమారు 40 మందిపై కేసు నమోదు చేశారు.

నానీని అంతమొందించడానికే దాడి

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



గన్‌మెన్ ధరణిని పరామర్శిస్తున్న నాని

తిరుచానూరు, మే 15: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని హత్య చేయడానికే వైసీపీ నేతలు పథకం ప్రకారం దాడి చేయించారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపిం చారు.తిరుచానూరు సమీపంలోని రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న పులివర్తి నానీ నివాసానికి బుధవారం రాత్రి నారాయణ వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతితో పాటు రాష్ట్రమంతా వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. సమ్మెట్లు, గొడ్డళ్లు, బీరు బాటిళ్లు మహిళా వర్శిటీ లోపలికి వచ్చా యంటే.. పోలీసు వ్యవస్థ, నిఘా వ్యవస్థ ఏం చేస్తున్నట్లు అని ఆయన ప్రశ్నించారు. ఈవీఎంలు దాచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా సౌక ర్యాలు సరిగా లేకపోవడం దారుణమన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సరైన ఏర్పాట్లు చేయా లని సూచించారు.సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామా నాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు వైఎస్ మణి, సీహెచ్ శివకు మార్, కార్తీక్, రమేష్ తదితరులతో పాటు కోట పురుషోత్తం, మంజు నాథ్ తదితరులు ఆయన వెంట వున్నారు. నానీని సినీ హీరో శివాజీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి పరామర్శించారు. నానీ దంపతులకు మనోధైర్యం చెప్పారు. అలాగే జిల్లాలో పలువురు ప్రముఖులు పులివర్తి నానీని పరామ ర్శించిన వారిలో ఉన్నారు.

టీడీపీ శ్రేణుల పరామర్శ

ఎర్రావారిపాలెం, మే 15: పులివర్తి నానీని పరామర్శించేందుకు ఎర్రావారిపాలెం మండలంలోని పలు గ్రా మాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు బుధవారం తిరుచానూరు సమీ పంలోని రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న ఆయన నివాసానికి తరలివ చ్చారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలు సుకున్నారు.



నానీని పరామర్శిస్తున్న శివాజీ, దివాకర్‌రెడ్డి



పులివర్తికి నేతల పరామర్శ

పలమనేరు, మే 15: తిరుపతిలో మంగళవారం వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని బుధవారం పలమనేరు, పూతలపట్టు అభ్యర్థులు అమరనాథరెడ్డి, మురళీ మోహన్, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయ మైన చర్యగా పేర్కొన్నారు. పోలీసుల వైఫల్యం వల్లే ఈ దాడి జరిగిందన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండు చేశారు.

దాడి చేసిన వారిని పట్టుకోకుండా..
టీడీపీ నేతలను స్టేషన్‌కు తీసుకువస్తారా..?

● రోడ్డుపై బైఠాయించి సుధారెడ్డి నిరసన

తిరుచానూరు, మే 15: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నానీపై హత్యాయత్నానికి పాల్పడి 24 గంటలు గడు స్తున్నా నిందితులను పట్టుకోకుండా ప్రివెంటివ్ అరెస్టు పేరుతో తెలుగుదేశం నేతలను స్టేషన్‌కు తీసుకువ స్తారా.. ఇలాగేనా మీరు ప్రవర్తించేది... అంటూ తిరుచా నూరు పోలీసుల తీరుపై తెలుగు మహిళా నాయకు రాలు పులివర్తి సుధారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం తిరుచానూరు పోలీసులు ప్రివెం టివ్ అరెస్టు పేరుతో టీడీపీ నేతలు ఈశ్వరయ్య, గోపి తదితరులను స్టేషన్‌కు తీసుకువచ్చారు.ఈ విషయం తెలుసుకున్న పులివర్తి సుధారెడ్డి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిని పోలీసులు పట్టుకోకుండా అధికార పార్టీకి భయపడి చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నానీపై దాడి జరిగిన దృశ్యాన్ని ఎస్పీకి ఇస్తే గంటలో నిందితులను పట్టుకుంటామని చెప్పి ఒకరోజు గడచి పోయినా ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గపు చర్య అంటూ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రోడ్డుపై టీడీపీ నేతలతో కలిసి బైఠాయించారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గన్ మెన్ గాయపడితే కూడా పోలీసులు స్పందించకపోతే ఎలా అని ఆమె ప్రశ్నిం చారు. జూన్ 4వ తేదీ వరకు ఏమీ చేయలే మని పోలీసు అధికారులు చెబుతున్నారు.. ఇదెక్కడి న్యాయం అంటూ ప్రశ్నించారు. దాదాపు రెండున్నర గంటల పాటు రోడ్డుపైనే టీడీపీ నేతలతో సుధారెడ్డి బైఠాయించి ఆందో ళన కొనసాగించారు.పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు తిరుచానూరుకు చేరుకోవడంతో కొంత సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీ నేతలు సీఆర్ రాజన్, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, సాయిరాయల్, వాణిగౌడ్, సాల్మన్‌రాజు, వాసు, హరేరామ్, పాండు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించిన సుధారెడ్డి

నానీపై హత్యాయత్నానికి కారణమేంటి?



భానుకుమార్‌రెడ్డి

తిరుపతి, మే 15 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై మారణాయుధాలతో జరిగిన దాడిలో రామచంద్రాపురం మండలానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకులు వల్లేటి భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి కీలకంగా పాల్గొన్నట్టు పోలీసులు గుర్తిం చారు. వీరిలో రామచంద్రాపురం మండలం జడ్పీటీసీ ఢిల్లీరాణి భర్త వల్లేటి భానుకుమార్‌రెడ్డి ఎమ్మెల్యే చెవి రెడ్డికి సన్నిహిత అనుచరుడిగా గుర్తింపు పొందారు. గత టీడీపీ ప్రభుత్వంలో రామాపురంలో డంపింగ్ యార్డు వివాదం తలెత్తి ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆందోళ నకు దిగిన సందర్భంలో భాను కూడా వెన్నంటి నిలి చారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి చెవిరెడ్డిని అరెస్టు చేయగా ఆ కేసులో భాను కూడా చెవిరెడ్డితో పాటు కొన్ని రోజులు రిమాండ్‌లో గడిపారు. అలాగే రెండేళ్ల కిందట రామాపురంలో రెవిన్యూ రికార్డుల్లో ప్రభుత్వానిదిగా నమోదైన ఎకరా భూమిని ఆక్ర మించి చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నారు. రెవిన్యూ అధికారులు ఫెన్సింగ్ తొలగించి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు కూడా నాటారు. అయితే దానిపై భానుకుమార్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఇక గణపతిరెడ్డి విషయానికొస్తే ఆయన ఇదే మండలంలోని నడవ లూరు సర్పంచ్. చెవిరెడ్డికి సన్నిహిత అనుచరుడు. అయితే పంచా యతీ నిధులన్నీ కార్యదర్శి స్వాహా చేశారని అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు సర్పంచ్‌కు విలువ లేదని అసంతృప్తితో వుండేవా రని, ఓ దశలో వైసీపీని వీడే ఆలోచన కూడా చేశారని అక్కడి వారు చెబుతున్నారు. వీరిద్దరూ ఎన్నికల్లో పనిచేసినందుకు ముఖ్యనేత డిన్నర్ ఇస్తున్నట్టు చెప్పి మంగళవారం ఉదయం కొందరు కార్యకర్త లను, అనుచరులను పిలిపించారని సమాచారం. వారిని మధ్యాహ్నం ఓ దాబాకు తీసుకెళ్లారని, అక్కడ తాగి, తిని నేరుగా పద్మావతీ వర్శి టీకి చేరుకుని దాడికి పాల్పడ్డట్టు చెబుతున్నారు. దాబాకు వెళ్లడా నికి ముందే మారణాయుధాలను వాహనాల్లో వుంచినట్టు చెబుతు న్నారు. అయితే చంద్రగిరితో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాల్లో బలమైన నేతగా వున్న పులివర్తి నానీపై హత్యాయత్నానికి పాల్పడడం ఆషామాషీ విషయం కాదు. దాని పర్యవసానాలు ఊహించలేనివేమీ కాదు. ముఖ్యంగా నానీకి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గన్ మ్యాన్‌తో పాటు ప్రైవేటు సెక్యూరిటీ కూడా బలం గానే వుంటుంది. దాడి చేస్తే గన్‌మ్యాన్ కాల్పులు జరి పితే ప్రాణాపాయం వుంటుందన్న సంగతి కూడా తెలియంది కాదు. అలాంటప్పుడు ఈ ఇద్దరు నాయ కులు ఏ కారణంగా ఇంత రిస్కుకు సిద్ధపడ్డారన్నది ప్రశ్నగా మారింది. కిరాయి వ్యక్తుల విషయంలో ఇలాంటి ప్రశ్నలకు తావులేదు కానీ సాధారణ రాజకీ యాలు చేసే గ్రామస్థాయి నాయకులు దీనికి తెగించడమే అందరినీ విస్తుగొలుపుతోంది.వీరు తమ ముఖ్యనేతపై అభిమానంతో దాడికి తెగబడ్డారా లేక ఎవరి ఆదేశాలతోనైనా ఈ పనిచేశారా అన్నది తేలాల్సి వుంది. ఇతరుల ఆదేశాలతో చేసివుంటే ఎవరి ఆదేశాలతో అన్నది తెలియాల్సి వుంది. వాస్తవానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి తరచూ చంద్రగిరి నియోజకవర్గం ప్రశాంతంగా వుండాలని కోరుకుంటున్నట్టు తరచూ చెబుతుంటారు. గతంలోనూ ఆయన గానీ, పులివర్తి నానీ గానీ హింసను, దౌర్జన్యాన్ని ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ఇపుడు కొత్తగా ఎందుకు ఈ సంస్కృతి నియోజకవర్గంలో మొదలైందన్నది అంతుబట్టడం లేదు. నియోజకవర్గంలో యువనేతల తీరు దూకు డుగా వుండడం, ఓ వర్గం నేత తరచూ ఎదుటివారిని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తుండడం కూడా తాజా సంస్కృతికి కారణం కావచ్చునన్న భావన నియోజకవర్గ ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తానికీ నానీపై దాడికి తెరవెనుక కారకులెవర్నది పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి వుంది. ఆ దిశగా పోలీసు దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగాల్సి వుంది.

చంద్రగిరిలో గన్‌మెన్ ధరణికి నానీ పరామర్శ

చంద్రగిరి, మే 15: వైసీపీ శ్రేణుల దాడిలో తనతో పాటు గాయపడిన గన్‌మ్యాన్ ధరణిని పులివర్తి నాని పరామర్శించారు.బుధవారం మధ్యాహ్నం స్విమ్స్ నుంచి నేరుగా చంద్రగిరిలో ఉంటున్న ధరణి ఇంటికి సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్‌తో కలసి నానీ చేరుకున్నారు. ధరణి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.దాడి సందర్భంగా గన్‌మ్యాన్ చూపిన ధైర్య సాహ సాలు అభినందనీయమన్నారు.

◆ కుప్పం- ఒక విశ్లేషణ

లక్ష లక్ష్యం నెరవేరినట్లేనా!

● టీడీపీలో జోరుగా లెక్కలు ● వైసీపీలో కనిపించని ఉత్సాహం

జిల్లాలో అత్యధిక పోలింగ్ జరిగింది కుప్పం నియోజకవర్గంలోనే. 89.88 శాతం ఓటింగ్ నమోదైందిక్కడ. 2019 ఎన్నికల్లో ఇది 85.43 శాతం. అంటే 4.45 శాతం పోలింగ్ పెరిగింది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం.. చంద్రబాబుకు 'లక్ష' మెజారిటీ లక్ష్యాన్ని అందించనుందా అనేది చర్చగా మారింది.

- కుప్పం

కుప్పం నియోజకవర్గంలో టీడీపీ మొదటినుంచి లక్ష మెజారిటీ లక్ష్యం అనే ప్రచా రాంశాన్ని తీసుకుంది. సూపర్ సిక్స్ పథకాలతోపాటు అయిదేళ్లలో వైసీపీ చేసిన అరా చకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. దాడులకు, దౌర్జన్యాలకు వెరువకుండా ప్రజల్లోకి వెళ్లారు. చంద్రబాబు మాత్రమే కుప్పం భవిష్యత్తు నిర్ణేత అని, ఇక వేరెవరికి చోటిచ్చినా అధోగతి తప్పదని విస్తృతంగా ప్రచారం చేశారు. అధికార పార్టీ అరాచకా లపై ఉన్న కసి, చంద్రబాబుమీద ఉన్న అభిమానమే పోలింగ్ బూత్‌లకు తండోపతం డాలుగా ఓటర్లను రప్పించిందని టీడీపీ శ్రేణులు నమ్ముతున్నాయి. 2019 ఎన్నికల్లో 85.43శాతం పోలింగ్‌కు సుమారు 30 వేల ఓట్లకు చంద్రబాబు మెజారిటీ దిగజారింది. ఇప్పుడు భిన్నమైన పరిస్థితులున్నాయని, వైసీపీమీద కసితో బాబుకు అత్యధిక మెజా రిటీ కట్టబెట్టడానికే ఓటర్లు వెల్లువెత్తారన్న విశ్లేషణలు సాగుతున్నాయి. పోలింగ్ రోజు ఉదయంనుంచే టీడీపీ శ్రేణుల్లో ఉరకలు వేస్తున్న ఉత్సాహం.. రోజురోజుకు పెరుగు తోంది.

వైసీపీలో కనిపించని జోరు : పోలింగ్ ప్రారంభమైన ఒకటీ ఒకటిన్నర గంట దాకా వైసీపీ శ్రేణులు కనిపించినా.. ఆ తర్వాత చాలామంది వెళ్లిపోయారు. నిజానికి పంచాయతీలు, మున్సిపాలిటీ అన్నీ అధికార పార్టీ ఏలుబడిలోనే ఉన్నాయి. అయినా సరే, నియోజకవర్గ స్థాయి నేతనుంచీ, గ్రామస్థాయి నేతలదాకా పోలింగ్ బూత్‌ల వద్ద పెద్దగా కనిపించడంలేదు. మంగళవారంనాడు పోలింగ్ పర్యవేక్షణ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ భరత్ కూడా ఈ పరిస్థితిపై వాపోయా రట. భారీగా పెరిగిన ఓటింగ్ శాతం వైసీపీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ మిగిల్చింది. పైకి మాత్రం తమ పథకాల లబ్ధిదారులు ఓటువేసేందుకు పోటెత్తడంవల్లే పోలింగ్ శాతం పెరిగిందని చెప్పుకోవడం తప్ప.. ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ మాత్రం కనిపించడంలేదు. పైగా ఓటుకు రూ.4 వేలు ఇచ్చారన్న ప్రచారం బెడిసికొట్టినట్లు కనిపిస్తోంది. ఎంపిక చేసిన 50 శాతం మంది ఓటర్లకే ఈ డబ్బులిచ్చి.. మిగిలిన సగం మందిలో అసం తృప్తి రగలడానికి ఇది కూడా కారణమైందని ఆ పార్టీ కార్యకర్తలే అంటున్నారు. పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న వైసీపీ నేతలు, లోలోపల మాత్రం గుబులుగానే ఉన్నారు. 13 మంది కుప్పం బరిలో ఉన్నా టీడీపీ, వైసీపీ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది.

తిరుపతి



పత్రికా స్వేచ్ఛను హరిస్తే గుణపాఠం తప్పదు

టీడీపీ నేత నరసింహయాదవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 15: పత్రికా స్వేచ్ఛను హరించిన వారికి గుణపాఠం తప్పదని టీడీపీ నేత నరసింహయాదవ్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో జర్నలిస్టులపై వ్యక్తిగత విమర్శలు చేయడం, బెదిరించడం టీటీడీ చైర్మన్ భూమనకు తగదన్నారు. భూమనపై చర్యలు తీసుకొని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. నానిపై దాడి చేసినవారికి జూన్ 4న గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నాయకులు మనోహరాచారి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బయో వ్యర్థాలను తొలగించకపోతే చర్యలు



బయో వ్యర్థాలను పరిశీలిస్తున్న సీఎస్‌ఆర్ఎంవో లక్ష్మానాయక్

తిరుపతి(వైద్యం), మే 15 : చెత్తాచెదారంతోపాటు బయో వ్యర్థాలను వెంటనే తొలగించకపోతే చర్యలు తప్పవని సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుయాస్పత్రిలో టీబీ వార్డు పక్కన భారీ ఎత్తున నిర్లక్ష్యంగా పడేసివున్న బయో వ్యర్థాలను హెల్త్ సూపర్‌వైజరు ప్రకాష్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. బయో వ్యర్థాలను కవర్లలో చుట్టి నిర్లక్ష్యంగా వదిలేయడటాన్ని గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ రెండుసార్లు అగ్నిప్రమాదం జరిగినా తిరిగి బయో వ్యర్థాలను ఎలా వేస్తారని పారిశుధ్య నిర్వాహకులపై ఆయన మండిపడ్డారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఎం.సురేష్‌కుమార్

తిరుపతి(వైద్యం), మే 15 : స్విమ్స్ యూనివర్సిటీలో కార్డియో వ్యాస్క్యులర్ అండ్ థొరాసిక్ సర్జరీ విభాగంలో పరిశోధన నిర్వహించిన విద్యార్థి ఎం.సురేష్‌కుమార్ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ పర్యవేక్షణలో సమర్పించిన గ్రంథాన్ని యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ పరిశీలించి పట్టాను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

గంగమ్మ జాతరలో అంబలి పంపిణీ



తిరుపతి (జీవకోన), మే 15: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం రోటరీ క్లబ్ భక్తులకు అంబలి పంపిణీ చేసింది. విసనకర్రలు, ఔషధ మొక్కలు, మూగజీవాలకు నీటి తొట్టెల వితరణ చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు పురుషోత్తంరెడ్డి, హేమచందర్, రవికుమార్, రాజేష్, మునస్వామిశెట్టి, చలపతిరావు, కరుణ, సుందరం, శేషయ్య తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి స్థానిక నిమ్మకాయల వీధిలో భక్తులకు అంబలి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, మాజీ టౌన్‌బ్యాంకు డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి, స్థానికులు,వస్త్ర వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌డీ సెట్‌లో ఎస్వీ జూనియర్ కళాశాల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు

తిరుపతి(విద్య), మే 15: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఆర్‌డీసెట్‌లో ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు తెలిపారు. కళాశాల విద్యార్థి బి. రాజశేఖర్ బీఎస్సీ ఎమ్మెస్సీఎస్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా పవన్ కుమార్ 2వ ర్యాంకును, సి. గౌరీశంకర్ 7వ ర్యాంకు, విజయ్‌కుమార్ 8వ ర్యాంకు సాధించారన్నారు. మరికొందరు 9, 13, 21, 27, 33 ర్యాంకులు సాధించారన్నారు. బీఏ గ్రూప్‌లో ఎల్. గంగాధర్ 2వ ర్యాంకు, బీకామ్ గ్రూప్‌లో హేమంత్‌కుమార్ 21వ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సీమాకుమార్ - ఎస్ఎస్ ప్రసాద్ - ఆరణి శ్రీనివాసులు

తిరుమల, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు ఎంపీ మిథున్‌రెడ్డి, సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ సీమా కుమార్, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ ఎస్ఎస్ ప్రసాద్ ఉన్నారు. ఈమేరకు వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తలపెట్టినవన్నీ నెరవేరాలని స్వామిని కోరుకున్నట్టు తిరుపతి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హింసను తరిమికొట్టి శాంతిని నెలకొల్పడంతో పాటు పవన్ తలపెట్టినవి నెరవేర్చాలని స్వామిని ప్రార్థించానన్నారు. ముఖ్యంగా తిరుపతి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామిని వేడుకున్నట్టు చెప్పారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 15: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. డిగ్రీ రెగ్యులర్ 5వ సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 21వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి. ఈ నెలాఖరులో పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి వివరాల కోసం విద్యార్థులు ఆయా కాలేజీల్లో సంప్రదించవచ్చునని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

పద్మావతి వర్సిటీలో భద్రత కట్టుదిట్టం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 15: ఈవీఎంల స్ట్రాంగ్ రూములున్న పద్మావతి మహిళా యూనివర్సిటీ పోలీసు దిగ్బంధనంలో ఉంది. మంగళవారం నాటి ఘటనల నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. యూనివర్సిటీ ముందు రోడ్డుపై రాకపోకలను పూర్తిగా బంద్ చేశారు. ఇనుప కంచెలు, బ్యారికేడ్లు అడ్డంగా ఉంచి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం అధికారులు యూనివర్సిటీ సిబ్బందికి సెలవు ప్రకటించారు.

రేపటి నుంచి పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు

ముస్తాబవుతున్న వేదిక





తిరుమల, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడ్రోజుల పాటు జరుగనున్నాయి. ఇందుకోసం తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ వేదిక ముస్తాబవుతోంది. తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోవైపు ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీల్లో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. తర్వాత కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహిస్తారు. ఈ మూడ్రోజుల పాటు ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉత్సవమూర్తులను కొలువుదీర్చే మండపంలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో దాదాపు 50మంది నిపుణులు మండపం నిర్మాణం, వివిధరకాల అలంకరణపనుల్లో నిమగ్నమయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో కూర్చుని ఉత్సవాలను వీక్షించేలా మండపాన్ని భారీగా నిర్మిస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు

తిరుమల, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 75,783 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,665 మంది తలనీలాలు సమర్పించారు.

తెలుగు సులభ పఠనానికి ఉచిత శిక్షణ

రేపట్నుంచి ఎంఎంబీజీలో విద్యార్థులకు తరగతులు



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న భాస్కర రాజు

తిరుపతి(విద్య),మే15: విద్యార్థులు తెలుగుభాష తప్పులు దొర్లకుండా అనర్గళంగా, అర్థవంతంగా, స్పష్టంగా చదివేందుకు వీలుగా తిరుపతికి చెందిన భాస్కరరాజు ఎడ్యుకేషన్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(మేక్ మై బేబీ జీనియస్ స్కూల్) సరికొత్త ప్రత్యేక బోధనా పద్ధతులను రూపొందించింది. ఈ పద్ధతుల ద్వారా తెలుగుభాష నేర్చుకుంటే రెండోతరగతి విద్యార్థులు సైతం పదవ తరగతి పాఠ్యపుస్తకాలను అలవోకగా చదివి పట్టు సాధిస్తారని కేంద్రం డైరెక్టర్ సంగరాజు భాస్కరరాజు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులకు తమ సంస్థల్లో ఈనెల 17నుంచి జూన్ 10 వరకు ఈ అంశంపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత నిరుద్యోగ యువత, ప్రభుత్వ ప్రైవేట్ టీచర్లకు రెండురోజుల శిక్షణా తరగతులు నిర్వహించగా విశేష స్పందన వచ్చిందన్నారు. శిక్షణకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు హాజరైనట్లు తెలిపారు. వివరాల కోసం 8886800091, 8886800093 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కుట్ర ప్రకారమే నానిపై దాడి : టీడీపీ



మీడియా సమావేశంలో ఆర్సీ మునికృష్ణ, ఊట్ల సురేంద్రనాయుడు తదితరులు

తిరుపతి (జీవకోన), మే 15: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అయన కుమారుడు మోహిత్‌రెడ్డి ఆదేశాలతో పథకం ప్రకారమే వైసీపీ కార్యకర్తలు దాడి చేశారని కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు ఆరోపించారు. బుధవారం తిమ్మినాయుడు పాలెం వద్ద పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ఓడిపోతుందన్న నిరాశతో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తుంటే అధికార, పోలీసుయంత్రాంగం, ఈసీ ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. దోషులను గుర్తించి హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, ధనంజయ్, పవన్, సాయి, సెల్వం, నాని తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి హత్యారాజకీయాలను సహించం : తెలుగు యువత



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 15: చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి చేస్తున్న హత్యారాజకీయాలను సహించమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నానిపై పక్కా ప్రణాళికతోనే వైసీపీ దాడి చేసిందన్నారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రవినాయుడు డిమాండ్ చేశారు. ఉన్నత విలువలు కలిగిన జర్నలిస్టులపై భూమన కరుణాకరరెడ్డి ఆరోపణలు చేయడం అర్థ రహితమన్నారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్రపై భూమన విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అభినయ్ రెడ్డి ఓటమి కళ్ళ ముందు కనిపిస్తుండటంతోనే జర్నలిస్టులపై భూమన విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కృష్ణయాదవ్, వాసుదేవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 144 సెక్షన్ కొనసాగింపు

తిరుపతి(కలెక్టరేట్), మే 15: జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దాడులు, గొడవలు, ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం 144వ సెక్షన్ కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.చట్ట వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించడం, ముగ్గురి కంటే ఎక్కువమంది గుమికూడటం, డ్రోన్లు ఎగురవేయడం సమావేశాల నిర్వహణ నిషేధమన్నారు.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, మే 15: చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతి వెళ్లే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు బుధవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే వెళతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.16057 చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి ఉదయం 6.25 గంటలకు బయలేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్, మధ్యాహ్నం 2.25 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు రేణిగుంట వరకే మాత్రమే వెళ్లనున్నాయి.
- నెం.16058 తిరుపతి నుంచి చెన్నై సెంట్రల్‌కు ఉదయం 10.10 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్, సాయంత్రం 6.05కు బయల్దేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరనున్నాయి.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు

సీమా కుమార్



తిరుపతి రైల్వే స్టేషన్ దక్షిణం వైపు నిర్మాణాలను పరిశీలిస్తున్న సీమకుమార్

తిరుపతి(సెంట్రల్)మే15: తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఇండియన్ రైల్వే బోర్డు మెంబరు(ఆపరేషన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్) సీమ కుమార్ అన్నారు. బుధవారం ఆమె తిరుపతి రైల్వే స్టేషన్ దక్షిణం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో ఉత్తరం-దక్షిణం వైపు నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతూ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ యార్డు అభివృద్ధి పనుల ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. చెన్నై-తిరుపతి రైలుమార్గంలోని రేణిగుంట వద్ద జరుగుతున్న బైపాస్ లైన్ పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జోనల్, డివిజన్ అధికారులు నాగ్యనాయక్, కెఆర్‌కె రెడ్డి, నీరజ్ అగర్వాల్, శ్రావణ్‌కుమార్, వినీత్ సింగ్, మనోజ్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే సంస్కారం నేర్పాలి



సభలో ప్రసంగిస్తున్న వీసీ భారతి

తిరుపతి(కల్చరల్) మే 15: పిల్లలకు సంస్కారం నేర్పాలని పద్మావతి మహిళావిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య భారతి చెప్పారు. స్థానిక రామకృష్ణా ఆశ్రమం ఆవరణలో రెండు వారాలుగా బాలలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య భారతి మాట్లాడుతూ సెలవులలో విద్యార్థులు యోగా వంటి విషయాలు సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. శరీరం, మనసు ఆరోగ్యంగా ఉండడానికి ఇటువంటి శిక్షణాశిబిరాలు ఉపకరిస్తాయన్నారు. రామకృష్ణ మిషన్ నిర్వాహకులను అభినందించారు. రామకృష్ణమిషన్ స్థానిక కమిటీ అధ్యక్షులు ఆచార్య పీవీ రెడ్డి మాట్లాడుతూ ఏటా రామకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో పిల్లలకు వేసవి శిక్షణాశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ పాత్రికేయులు రంగనాథన్, శ్రీరామకృష్ణ ఆశ్రమకార్యదర్శి స్వామి సుకృతానంద మాట్లాడారు. విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. స్వామి సత్వస్థానంద, చైతన్య, జియస్ ప్రసాద్, తల్లిదండ్రులు పలువురు భక్తులు పాల్గొన్నారు.






ఆరణికి శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న టీడీపీ నేతలు - అన్నదానం చేస్తున్న శ్రీనివాసులు

తిరుపతి ప్రశాంతత కోసం గంగమ్మను వేడుకున్నా : ఆరణి

తిరుపతి, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని ప్రశాంతంగా ఉండాలని గంగమ్మ తల్లిని కోరుకున్నట్టు టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కారణంగా జాతర ఆలస్యమైనా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటుండటం సంతోషంగా ఉందన్నారు. . ఎన్డీఏ నేతలు పెద్దఎత్తున ఆయన నివాసానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో నేతలు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, మందలపు మోహన్ రావు, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, మస్తాన్ నాయుడు, ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, ధనంజయ తదితరులు ఉన్నారు.

రుయాస్పత్రి వద్ద అన్నదానం

తిరుపతి(వైద్యం), మే 15 : జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా రుయాస్పత్రి ముందు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసులు పాల్గొని రోగులకు భోజనం వడ్డించారు. దాదాపు వెయ్యి మందికి పైగా రోగులకు అన్నదానం చేశారు. టీడీపీ నేతలు మహేష్ యాదవ్, రజనీకాంత్ నాయుడు, ఆర్సీ శ్రీనివాసులు, లక్ష్మయ్య, రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి



లాఠీచార్జితో తగిలిన గాయాలు చూపుతున్న ఫొటోగ్రాఫర్లు

తిరుపతి(నేరవిభాగం), మే 15: తిరుపతి మహిళా వర్శిటీ వద్ద మంగళవారం సాయంత్రం జర్నలిస్టులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు ఎం. ప్రసాద్, పి. నరేంద్ర డిమాండ్ చేశారు.లాఠీచార్జి ఘటనపై బుధవారం యూనియన్ నాయకులు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏఎస్పీ కులశేఖర్‌కు ఫిర్యాదు చేశారు.మహిళా వర్శిటీ వద్ద టీడీపీ,వైసీపీ వర్గాల దాడుల కవరేజికి వెళ్ళిన మీడియా సిబ్బందిపై కూడా లాఠీచార్జి చేయడంతో పదిమంది గాయపడ్డారన్నారు.అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి తీరు కారణంగానే ఈ పరిస్థితి నెలకొందన్నారు.ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.మీడియా ఫొటోగ్రాఫర్ల యూనియన్ తరపున కూడా మరో ఫిర్యాదు అందజేశారు.లాఠీచార్జితో తగిలిన గాయాలను బాధితులు ఏఎస్పీకి చూపించారు.లాఠీచార్జిపై ఫిర్యాదు చేయడానికి అంతకుముందు జర్నలిస్టులంతా కలసి ఎస్పీ కార్యాలయం వద్దకు వెళ్ళారు.ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద వున్నారని తెలుసుకుని అక్కడకు వెళ్లగా పోలీసులు ఆయన్ను కలవడానికి అనుమతి ఇవ్వలేదు.దీంతో అలిపిరి స్టేషన్ వద్ద ఏఎస్పీకి ఫిర్యాదు సమర్పించారు. ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ నేతలు శ్రీధర్,జనార్దన్, దినేష్‌కుమార్, గిరిబాబు,మునిరాజు, లక్ష్మీపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూమన నుంచి రక్షణ కల్పించండి

తిరుపతి శాసనసభ్యుడు భూమన కరుణాకరరెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర పోలీసులను కోరారు.అలిపిరి స్టేషన్‌లో ఏఎస్పీ కులశేఖర్‌కు బుధవారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వైసీపీ ఎన్నికల ప్రచార ముగింపు సభలో ఆయన తమపై పలు నిరాధార ఆరోపణలు చేయడమే అంతు చూస్తానంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారన్నారు. ఈ సంఘటన తరువాత తమ ఇండ్ల పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని ,వారు ఎమ్మెల్యే అనుచరులే అయి వుంటారని అనుమానం వ్యక్తం చేశారు. కరుణాకరరెడ్డి వలన తమకు ప్రాణహాని వున్నందున రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమపై నిరాధార ఆరోపణలు చేసినందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఏఎస్పీకి ఫిర్యాదు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధులతో యూనియన్ నేతలు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

144 సెక్షన్ అమల్లో వుంది : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, మే 15: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకు 144 సెక్షన్ అమలులో వుంటుందని డీఎస్పీ సూర్యనారాణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద డీఎస్పీ మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. ఎక్కడైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. చిల్లకూరులో ఎన్నికలరోజు జరిగిన ఘర్షణపై విచారణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐలు పాపారావు, వేణుగోపాల్‌రెడ్డి, రవికిరణ్, ఎస్ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



గూడూరు అర్బన్, మే 15: ఏపీఆర్‌జేసీ ఎంట్రెన్స్ ఫలితాల్లో స్థానిక శివానీ స్టడీ సర్కిల్ విద్యార్థులు ప్రతిభచాటినట్లు కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. తమ స్టడీ సర్కిల్‌కు చెందిన విద్యార్థులు మహీన్(213), తనూష్(364), హర్షిత్(528), సింధూ(583)రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడంతోపాటు పలువురు విద్యార్థులు ప్రతిభచాటారన్నారు. దీంతో విద్యార్థులను అభినందించామన్నారు. కార్యక్రమంలో మయూరి శ్యామ్‌యాదవ్, కమలాకర్, కడివేటి చంద్రశేఖర్, శ్రీహరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జీ షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం

గూడూరు అర్బన్, మే 15: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చునని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం అన్నారు. బుధవారం స్థానిక కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివాదాల పరిష్కార ప్రత్యామ్నాయం, మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరుపక్షాలకు ఆమోద్యయోగ్యమైన రాజీమార్గాలకే కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనారాణి, లోకనాథం, న్యాయవాదులు కోటేశ్వరరావు, కొండలరావు, కృష్ణయ్య, వెంకటసుబ్బయ్య, భాగ్యలక్ష్మి, శ్రీనివాసులు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



అరుణను పరామర్శిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం, విజయశ్రీ

పెళ్లకూరు, మే 15 : టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. పెళ్లకూరులో వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన గర్భిణి అరుణను బుధవారం టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, మధునాయుడు, ఇతర నాయకులతో కలసి వారు పరామర్శించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి రెచ్చగొట్టే ధోరణి మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించబోమని, తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా కల్పించారు. వారి వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, చంద్రబాబునాయుడు తదితరులు ఉన్నారు.

నీటి గుంటలో పడి బేల్దారి మృతి



సుబ్బరాయులు(ఫైల్)

చిట్టమూరు, మే 13 : మండల పరిధిలోని మల్లాం రొయ్యల కాలువ సమీపంలో బుధవారం సాయంత్రం నీటి గుంటలోకి దిగి ఈదూరు సుబ్బరాయులు (40) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.... సోమసముద్రం గ్రామానికి చెందిన సుబ్బరాయులు, మరో ఇద్దరు కలసి మద్యం తాగేందుకు ఈ గుంట సమీపంలోకి వెళ్లారు. మద్యం తాగిన తరువాత సుబ్బరాయులు తాను గుంటలో మునిగి వస్తానని చెప్పి గుంటలో దిగాడు. గుంటలో దిగిన సుబ్బరాయులు కన్పించలేదు. ఇతడితోపాటు ఉన్న మరో ఇద్దరు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు గుంటలోకి దిగి గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. ఎస్ఐ చిన్నబలరామయ్యకు సమాచారం ఇవ్వడంతో తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడు బేల్దారిగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

చిన్నారిపై కుక్కదాడి

గూడూరు అర్బన్ : స్థానిక మసీదువీధిలో మంగళవారం రాత్రి చిన్నారిపై కుక్క దాడి చేసింది. మసీదువీధికి చెందిన 6ఏళ్ల చిన్నారి శివాలయం వీధి నుంచి ఇంటికి వెళుతుండగా ఓ కుక్క చిన్నారిపై దాడిచేసి గాయపరిచింది. దీంతో చిన్నారిని కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

గుంతలమయంగా చెన్నూరు రోడ్డు





రాళ్లుతేలిన చెన్నూరు సమీపంలోని ప్రధాన రహదారి, గుంతలమయంగా ఉన్న చెన్నూరు రోడ్డు

గూడూరు, మే 15: మండలంలోని చెన్నూరు సమీపంలో ప్రధాన రహదారి రాళ్లతేలి, గోతులమయంగా మారింది. దీంతో ప్రయాణం నరకయాతనగా ఉందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. గూడూరు నుంచి వెంకటగిరి, రాపూరు వైపు వెళ్లాలన్నా, చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాలకు వెళ్లాలన్నా ఈ రహదారి పైనే రాకపోకలు సాగించాల్సివుంటుంది. ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంపై రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సమీప గ్రామాల ప్రజలు గూడూరు పట్టణానికి వెళ్లాలన్నా, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లాలన్నా, నిమ్మకాయలు మార్కెట్‌కు తీసుకువెళ్లే వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది రాళ్ల తేలి గోతులమయంగా మారిన ఈ రోడ్డు అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాహనదారులు అంటున్నారు. రాత్రి సమయంలో గోతులు కనిపించక ప్రమాదాలకు లోనునవుతున్నామని, అధికారులు స్పందించి చెన్నూరు రోడ్డును అభివృద్ధిపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జర్నలిస్టులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి



లాఠీచార్జితో తగిలిన గాయాలు చూపుతున్న ఫొటోగ్రాఫర్లు

తిరుపతి(నేరవిభాగం), మే 15: తిరుపతి మహిళా వర్శిటీ వద్ద మంగళవారం సాయంత్రం జర్నలిస్టులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు ఎం. ప్రసాద్, పి. నరేంద్ర డిమాండ్ చేశారు.లాఠీచార్జి ఘటనపై బుధవారం యూనియన్ నాయకులు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఏఎస్పీ కులశేఖర్‌కు ఫిర్యాదు చేశారు.మహిళా వర్శిటీ వద్ద టీడీపీ,వైసీపీ వర్గాల దాడుల కవరేజికి వెళ్ళిన మీడియా సిబ్బందిపై కూడా లాఠీచార్జి చేయడంతో పదిమంది గాయపడ్డారన్నారు.అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి తీరు కారణంగానే ఈ పరిస్థితి నెలకొందన్నారు.ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.మీడియా ఫొటోగ్రాఫర్ల యూనియన్ తరపున కూడా మరో ఫిర్యాదు అందజేశారు.లాఠీచార్జితో తగిలిన గాయాలను బాధితులు ఏఎస్పీకి చూపించారు.లాఠీచార్జిపై ఫిర్యాదు చేయడానికి అంతకుముందు జర్నలిస్టులంతా కలసి ఎస్పీ కార్యాలయం వద్దకు వెళ్ళారు.ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద వున్నారని తెలుసుకుని అక్కడకు వెళ్లగా పోలీసులు ఆయన్ను కలవడానికి అనుమతి ఇవ్వలేదు.దీంతో అలిపిరి స్టేషన్ వద్ద ఏఎస్పీకి ఫిర్యాదు సమర్పించారు. ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ నేతలు శ్రీధర్,జనార్దన్, దినేష్‌కుమార్, గిరిబాబు,మునిరాజు, లక్ష్మీపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూమననుంచి రక్షణ కల్పించండి

తిరుపతి శాసనసభ్యుడు భూమన కరుణాకరరెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర పోలీసులను కోరారు.అలిపిరి స్టేషన్‌లో ఏఎస్పీ కులశేఖర్‌కు బుధవారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వైసీపీ ఎన్నికల ప్రచార ముగింపు సభలో ఆయన తమపై పలు నిరాధార ఆరోపణలు చేయడమే అంతు చూస్తానంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారన్నారు. ఈ సంఘటన తరువాత తమ ఇండ్ల పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని ,వారు ఎమ్మెల్యే అనుచరులే అయి వుంటారని అనుమానం వ్యక్తం చేశారు. కరుణాకరరెడ్డి వలన తమకు ప్రాణహాని వున్నందున రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమపై నిరాధార ఆరోపణలు చేసినందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఏఎస్పీకి ఫిర్యాదు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధులతో యూనియన్ నేతలు

దేశాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వరప్రసాద్‌రావు

తడ, మే 15 : కేంద్రంలోని బీజేపీపై ప్రజల్లో ఎంతో సానుకూలత ఉందని, సుస్థిర భారతదేశ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, ఇది ప్రజల్లోకి బలంగా వెళ్లడంతో కూటమి అభ్యర్థుల వైపు ఓటర్లు మొగ్గుచూపారని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ అన్నారు. పోలింగ్ రోజున బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. బుధవారం తడకు వచ్చిన ఆయన టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సరళి విజయావకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల్లో పోలింగ్ రోజున బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మురళీరెడ్డి, బొమ్మన శ్రీధర్, సెల్వం, నీలకంఠం, పళణి, శ్రీకాంత్‌రెడ్డి, జయపాల్, బీజేపీ నాయకులు రాచర్ల కృష్ణమూర్తి, జనసేన నాయకులు బాబు పాల్గొన్నారు.

మొగిలి ఘాట్‌లో ట్రాక్టరును ఢీకొన్న లారీ

ఇద్దరు కూలీల దుర్మరణం ● ఐదుగురికి తీవ్రగాయాలు





మృతిచెందిన వేణు - రాజు

బంగారుపాళ్యం, మే 15: డౌన్ రోడ్డులో లారీ అదుపు తప్పింది. ఎండుగడ్డి ట్రాక్టరును ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం రాత్రి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో ఈ ప్రమాదం జరిగింది. బంగారుపాళ్యం మండలం కీరమంద గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు కలిసి పలమనేరు నుంచి ఎండు వరిగడ్డిని బంగారుపాళ్యంకు తీసుకొస్తున్నారు. అదే సమయంలో పలమనేరు నుంచి చిత్తూరు వైపు కట్టెల లోడ్డుతో లారీని తీసుకుని భద్రాచలానికి చెందిన డ్రైవరు రామారావు వస్తున్నారు. మొగిలి ఘాట్ వద్ద రోడ్డు ఏటవాలుగా ఉంది. వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ముందుగా వరిగడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనతో ట్రాక్టరు ట్రాలీ ఊడి గడ్డితో పాటు పడిపోయింది. ట్రాక్టరు ఇంజన్ మాత్రం వంద మీటర్ల దూరంలో బోల్తా పడింది. దీని వెనుకే వస్తున్న అట్టపెట్టెల లారీ.. ప్రమాదానికి గురైన కట్టెల లారీని ఢీకొంది. కాగా, ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురు ఈ ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిపోయారు. వీరిలో వేణు(60) అక్కడికక్కడే మృతిచెందగా.. రాజా(34), జయచంద్ర (49), రాజయ్య(42), ట్రాక్టరు డ్రైవరు నాగభూషణం(29), బాబు(45), లారీ డ్రైవరు రామారావు(35)ను బంగారుపా ళ్యం ఆస్పత్రికి తరలించా రు.అక్కడ చికిత్స పొందు తూ రాజా మృతి చెందారు. క్షతగాత్రులకు చికి త్స చేయడానికి సరిపడా డాక్టర్, సిబ్బంది బంగారుపాళ్యం ఆస్పత్రిలో లేకపోవడంతో 20 నిమిషాల పాటు క్షతగాత్రులకు వైద్యం అందలేదు. దాంతో స్థానికులు డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ప్రథమచికిత్స అందించాక మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాద స్థలంలో చీకటిగా ఉండటంతో కట్టెలన్నీ రోడ్డుపై పడటంతో ఎక్స్‌కవేటరు సాయంతో తొలగించారు. రెండు గంటలకుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా వరినాట్లు





తిన్నెలపూడి వద్ద వరినాట్లు వేసేందుకు అడిసిదుక్కి దున్నుతున్న రైతు, గూడలిలోని దక్షిణ పొలం వద్ద ఎడగారు నాట్లు వేస్తున్న మహిళలు



రాజుపాళెం వద్ద వరి నారుమడి

కోట మండల పరిధిలోని స్వర్ణముఖి నది పరీవాహక గ్రామాల్లో పది రోజుల నుంచి వరి ఎడగారు నాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో రైతులు అడుసుదుక్కులు దున్నుతున్నారు. గూడలి, రాజుపాళెం, దక్షిణపొలం, అల్లంపాడు, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, ఉత్తమనెల్లూరు తదితర గ్రామాల రైతులు 7,500 ఎకరాల్లో వరి సాగుకు సన్నద్ధమయ్యారు. ఎక్కువ దిగుబడి ఇచ్చే 1010రకం, నెల్లూరు జిలకర్ర నాటు తున్నారు. ఫిల్టర్ పాయింట్ల కింద కూడా వరి సాగుకు రైతులు సిద్ధమయ్యారు. - కోట

పేద బ్రాహ్మణులకు సరుకుల పంపిణీ



వాకాడు, మే 15 : మండలంలోని బాలిరెడ్డిపాళెంలో వెలసిన పట్టాభిరామాలయం, సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 45 మంది పేద బ్రాహ్మణులకు బుధవారం రూ.1.85 లక్షలు విలువచేసే సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సీతారామ ధార్మిక సేవాసంస్థ వ్యవస్థాపకులు దివి అనంతాచార్యులు మాట్లాడుతూ చిట్టమూరు రుక్మిణమ్మ, రామిరెడ్డి మధుకిరణ్‌రెడ్డి దాతృత్వంతో అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో దివి శ్రీనివాసాచార్యులు, దివి లక్ష్మీనరసింహచార్యులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

పెళ్లకూరు, మే 15 : ఎన్నికల వివాదాలకు సంబంధించి వైసీపీ, టీడీపీ వర్గాలపై కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... టీడీపీకి అనుకూలంగా ఉన్న గర్భిణి అరుణపై వైసీపీకి చెందిన తేజ, మాలతి, కోటమ్మ, లీలావతి తదితరులు విచక్షణారహితంగా దాడి చేశారు. ఇందులో నిందితులపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఓ మాజీ వలంటీర్‌పై పేరం రమేష్ నాయుడు, పేరం మధు నాయుడు ప్రోద్బలంతో సెల్వ, అర్జున్, అరుల్ తదితర పదిమందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

● వివాహమైన 26 రోజులకే మృత్యు ఒడిలోకి



శెట్టిరాజేష్(ఫైల్)

నాయుడుపేట టౌన్, మే 15 : నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో శెట్టి రాజేష్(28) తన తల్లిదండ్రులతో కలసి ఉంటున్నాడు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 26 రోజుల క్రితం రాజేష్‌కు తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన స్నేహలతతో ప్రేమవివాహం జరిగింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రాజేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు పట్టణంలో పలు ప్రాంతాలలో వెతుకులాట ప్రారంభించారు. అయితే బుధవారం ఉదయం రాజేష్ సెల్‌ఫోన్ నుంచి ఇంటికి ఫోన్ వచ్చింది. రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై మృతదేహం ఉంది, పక్కనే ఈ ఫోన్ నెంబరు గల సెల్‌ఫోన్ ఉంది అంటూ తెలిపారు. సంఘటనాస్థలికి చేరుకున్న రాజేష్ తల్లిదండ్రులు, భార్య స్నేహలత రాజేష్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. రాజేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ప్రమాదవశాత్తు మృతి చెందాడా అన్న కోణంలో రైల్వే ఇన్‌చార్జి ఎస్ఐ కొండప్పనాయుడు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పంచనామా నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం



వాకాడు, మే15 : నిడిగుర్తి పంచాయతీ గొల్లపాళెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లింగారెడ్డి వెంకటకృష్ణారెడ్డి పోలింగ్‌బూత్ వద్ద అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. టీడీపీ కార్యకర్తలు పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందడంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ సౌజన్యంతో టీడీపీ నాయకులు రూ.20వేలను మృతుడి అల్లుడు వెంకటచలమారెడ్డి ఇంటికి వెళ్లి అందజేశారు.

పోలీస్‌స్టేషన్‌కు డిగ్రీ ప్రశ్నపత్రాలు



కోట, మే 15 : కోట పోలీస్‌స్టేషన్‌కు బుధవారం డిగ్రీ మొదటి సంవత్సరం సెమ్-2 ప్రశ్నపత్రాలు చేరాయి. ఈ మేరకు అధికారులు ఆ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈనెల 16వ తేదీ నుంచి జూన్ మొదటి వారం వరకు డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

రాజీ కుదుర్చుకోమని పోలీసుల సలహా



గాయపడిన బాలయ్య

సూళ్లూరుపేట, మే 15: మండల పరిధిలోని వెలగలపొన్నూరులో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీకి చెందిన వారు దాడి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెలగల పొన్నూరుకు చెందిన ఓసూరు బాలయ్య టీడీపీ సానుభూతిపరుడు. పోలింగ్ రోజు గ్రామంలో ఆటో పెట్టే విషయంలో వైసీపీ చెందిన వారితో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది అదునుగా తీసుకొని మంగళవారం రాత్రి టీడీపీ సానుభూతి పరుడు బాలయ్యపై వైసీపీకి చెందిన పెళ్లూరు శివనయ్య, వెంకటరమణ తన అనుచరులతో కలిసి కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో బాలయ్య తలకు తీవ్ర గాయాల య్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాలయ్య కుటుంబ సభ్యుల పై కూడా దాడిచేశారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు ఆటో తీస్తుండగా వైసీపీ నాయకులు ట్రాక్టర్ అడ్డంగా పెట్టి అడ్డుకున్నారు. చేసేదేమి లేక వారు వేరే మార్గంలో మోటారు సైకిల్‌పై పక్క గ్రామం సుద్దమడుగు తాగేలి వరకు వచ్చి అక్కడ నుంచి ఆటోలో సూళ్లూరుపేటకు చేరుకున్నారు. బాధితులు సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో రాజీ కుదుర్చుకోమని రాయబారాలు చేశారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఉన్నారు. చివరకు చేసేదేమి లేక పోలీసులు రాత్రి 9 గంటల తరువాత ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పీఎన్ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు


పీఎన్ రహదారిపై స్తంభించిన వాహనాలు

శ్రీకాళహస్తి, మే 15: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పలేదు. శ్రీకాళహస్తి పట్టణ శివారు మిట్ట కండ్రిగ వద్ద నుంచి మండలంలోని కాపుగున్నేరి వరకు రహదారిపై వాహనాలు స్తంభించాయి. బుధవారం సాయంత్రం 6గంటల సమయంలో ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. సుమారు ఒకటిన్నర గంట పాటు వాహనదారులకు అవస్థలు తప్పలేదు.

ఎన్నికల విధుల్లో హెచ్‌ఎంకు అస్వస్థత
నెల్లూరు అపోలోలో వెంటిలేటర్‌పై చికిత్స చికిత్స
పట్టించుకోని జిల్లా ఎన్నికల అధికారులు

బుచ్చినాయుడు కండ్రిగ, మే 15: మండలంలోని చిన్నాయగుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం సుమన్‌రావు ఎన్నికల విధుల్లో అస్వస్థకు గురై నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈనెల 12వ తేదీన సుమన్‌రావు గూడూరు నియోజకవర్గంలోని చెందోడులో ఎన్నికల విధులకు హాజరయ్యారు. అదే రోజు రాత్రి అస్వస్థతకు గురయ్యారు. 13వ తేదీ ఉదయం విధులకు హాజరు కాగా 8గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురవడంతో స్థానిక వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కోట ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ సుమన్‌రావు స్పృహతప్పి పడిపోవడంతో నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న సుమన్‌రావు బుధవారం వరకు స్పృహలోకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లా ఎన్నికల అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడం పట్ల యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమన్‌రావు

21 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, మే 15: పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 21న నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 25వ తేదీ శనివారం గరుడవాహనం, 28న రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. గరుడ వాహనం, రథోత్సవం, స్వామివారి కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తామని తెలిపారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


కోయిల్ అళ్వార్ తిరుమంజనంలో పాల్గొన్న ఆలయాధికారులు

నారాయణవనం, మే 15: పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 21నుంచి 29వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్టును పూర్తిగా వస్త్రంతో కప్పివేసి, ఆలయ ప్రాంగణం, గోడలు, ఆలయ పైకప్పు, పూజా సామగ్రి వంటి వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలను కలగలిసినా పవిత్రజలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఈవో నాగరాజు, సూపరింటెండెంట్ ధర్మయ్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, మే 15: చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతి వెళ్లే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు బుధవారం నుంచి ఈ నెల 31వ తేది వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే వెళతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.16057 చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి ఉదయం 6.25 గంటలకు బయలేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్, మధ్యాహ్నం 2.25 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు రేణిగుంట వరకే మాత్రమే వెళ్లనున్నాయి.
- నెం.16058 తిరుపతి నుంచి చెన్నై సెంట్రల్‌కు ఉదయం 10.10 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్, సాయంత్రం 6.05కు బయల్దేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరనున్నాయి.

వివాదంపై కేసు నమోదు

కేవీబీపురం, మే 15: మండలంలోని ఎంపి రాజులకండ్రిగ గ్రామంలో 13వ తేదీన జరిగిన పోలింగ్ సందర్భంగా బూత్ నెం.106 వద్ద ఏర్పడిన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఈ ఘటనపై రెండు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. బీఎస్పీ నాయకురాలు లావణ్య ఫిర్యాదు మేరకు ఐదుగురి అట్రాసిటీ కేసు చేసినట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. అలాగే ప్రత్యర్థి వర్గం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎస్పీకి చెందిన 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

సత్యవేడులో గంగజాతర చాటింపు


అంబళ్లు పోస్తున్న దృశ్యం

సత్యవేడు, మే 15: సత్యవేడులో త్వరలో జరగనున్న గంగమ్మ జాతరకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం చాటింపు వేశారు. గంగమిట్ట వద్ద ప్రత్యేక కలిశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆలయం వద్దకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అంబళ్లు పోశారు. కాగా, ఈనెల 29, 30 తేదీల్లో జాతర పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పులివర్తి నానీకి పరామర్శ


నానీని పరామర్శిస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మే 15: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని శ్రీకాళహస్తి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పరామర్శించారు. తిరుపతి పద్మావతి యూనివర్శిటీ వద్ద పులివర్తి నానీపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. తిరుపతిలో చికిత్స పొందుతున్న నానీని బుధవారం సుధీర్‌రెడ్డి పరామర్శించారు. వైసీపీ రౌడీ విధానాలను ఖండించారు.

గురవారెడ్డికి సన్మానం

శ్రీకాళహస్తి, మే 15: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన రెడ్డివారి గురవారెడ్డిని బుధవారం వన్నెకుల క్షత్రియ నాయకులు సన్మానించారు. పురపాలక సంఘ మాజీ వైస్ చైర్మన్ మిన్నల రవి, ఎంఎస్‌రెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, నాగరాజు, మునిరెడ్డి, మణికంఠారెడ్డి, శివారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, మునిరాజారెడ్డి, గుణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపునకు విద్యార్థినులు

పిచ్చాటూరు, మే 15: పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు ప్లస్ విద్యార్థినులు తిరుపతిలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపునకు బుధవారం తరలివెళ్లారు. పది రోజులు పాటు జరిగే క్యాంపులో తమ పాఠశాల విద్యార్థినులు 40 మంది పాల్గొంటున్నట్టు హెచ్‌ఎం గిరిప్రకాష్ వెల్లడించారు.

టీడీపీ నేత జన్మదిన వేడుకలు


దశరథాచారిని సన్మానిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, మే 15: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి 60వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మతో పాటు టీడీపీ నాయకులు జంగాలపల్లి తులసీరాం, చెలికం పాపిరెడ్డి, గుర్రప్పశెట్టి, చెంచయ్యనాయుడు, రావిళ్ల మునిరాజానాయుడు, మిన్నల రవి, ఎం.సుబ్బయ్య, డీవీ నారాయణ, పోలూరు శ్రీనివాసులురెడ్డి, మురళి, ఉమేష్‌రావు, ప్రకాష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆక్రమిత ఖాతాలో మరో చెరువు
సగానికి పైగా కాజేసి ప్లాట్లలో గదుల నిర్మాణం ● రూ.6 లక్షల చొప్పున విక్రయాలు


బేరివానిగుంట చదును చేసి నిర్మించిన గదులు

రేణిగుంట, మే 15: అక్కడ వైసీపీ నాయకుల మాటే శాసనం. వారు ఏ స్థలమైనా ఆక్రమించవచ్చు.. ప్లాట్లు వేసి అమ్మేయవచ్చు. తాజాగా వారి జమానాలో చెరువు మాయమైంది. రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లె సమీపంలో ఇటీవల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. గ్రామంలో కొందరు స్థానికులు అడ్డుకున్నారు. తాము ఎప్పటి నుంచో ఈ ప్రాంతంలో పట్టాల కోసం ప్రభుత్వాన్ని కోరుతుంటే మీరు ఎలా కబ్జా చేస్తారని ప్రశ్నించారు. దీంతో సదరు వైసీపీ నాయకులు పక్కనే ప్రభుత్వానికి చెందిన బేరివానిగుంటలో 535 సర్వే నెంబరులో 8.48 ఎకరాల స్థలం తీసుకోవాలని సూచించారు. దీంతో ఆ ప్రాంత పేదలు బేరివానిగుంటలో ప్లాట్లుగా వేసి చిన్నపాటి గదులను నిర్మించుకున్నారు. అయితే వైసీపీ నేతలు ఊరుకోలేదు. అక్కడ కూడా సింహభాగం స్థలాన్ని తీసేసుకుని సుమారు వంద నివాస గదులను నిర్మించేశారు. గదులున్న ఆ ప్లాట్లను బహిరంగ మార్కెట్‌లో రూ.6లక్షల వంతున అమ్మకాలకు పెట్టారు. ఇప్పుడు అక్కడ చెరువు సగం కనుమరుగైంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మత్స్యకార శాఖ అధికారులు కనీసం స్పందించలేదు. విశేషమేటంటే ఆక్రమిత గుంటలో మత్స్యకార శాఖ గతేడాది చేపలకు వేలం పాట నిర్వహించింది. రేణిగుంట ప్రభుత్వ రికార్డులో ఇది చెరువుగా స్పష్టంగా నమోదయ్యింది.

ఆర్వో ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

సత్యవేడు, మే 15: కలుషిత నీటిని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సత్యవేడు మండలంలోని అమాసరెడ్డి కండ్రిగకు చెందిన అమాసరెడ్డి డిమాండ్ చేశారు. సత్యవేడు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...గ్రామానికి చెందిన ఈశ్వరయ్య అనే వ్యక్తి గ్రామంలో వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడని తెలిపారు. అయితే ప్లాంట్ నిర్వాహణకు అవసరమైన నీటి కోసం ఏర్పాటు చేసిన బోరు పక్కనే సెప్టిక్ ట్యాంకు కూడా ఉందన్నారు. బోరు నుంచి వచ్చే నీరు సెప్టిక్ ట్యాంకులోని మలినాలతో కలిసి సరఫరా అవుతుండడం వల్ల కలుషితమవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించి, వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారని తెలిపారు. అయితే మళ్లీ ప్లాంట్‌ను తెరచి వ్యాపారం నిర్వహిస్తున్నాడని తెలిపారు. కలుషిత నీటిని విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరి లోకేశ్‌ను వివరణ కోరగా వాటర్ ప్లాంట్‌కు ఇటీవలే అనుమతులు ఇచ్చామని తెలిపారు. కలుషిత నీటి విషయంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

పిచ్చాటూరు, మే 15: పిచ్చాటూరు మండలంలోని వేలూరులో బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి ఎన్నికల్లో అహర్నిశలు శ్రమించి టీడీపీ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరూ దైవ సమానులేనని పేర్కొన్నారు. తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కన్నయ్యనాయుడు, ప్రభాకర్‌నాయుడు, తిరుమలరెడ్డి, పద్మనాభరాజు, మల్లికార్జున్‌రెడ్డి, బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు
రైల్వే బోర్డు మెంబరు సీమా కుమార్


రైల్వే స్టేషన్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న సీమా కుమార్

తిరుపతి(సెంట్రల్) మే15: తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు మెంబరు(ఆపరేషన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్) సీమా కుమార్ అన్నారు. తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా, వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ యార్డు అభివృద్ధి పనుల ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. చెన్నై - తిరుపతి రైలు మార్గంలోని రేణిగుంట వద్ద జరుగుతున్న బైపాస్ లైన్ పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోనల్, డివిజన్ అధికారులు నాగ్యనాయక్, కేఆర్‌కే రెడ్డి, నీరజ్ అగర్వాల్, శ్రావణ్‌కుమార్, వినీత్ సింగ్, మనోజ్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో జపాన్ కాన్సుల్ జనరల్


జపాన్ కాన్సుల్ జనరల్‌కు శ్రీసిటీ గురించి వివరిస్తున్న వైస్ ప్రెసిడెంట్ శివశంకర్ వరణ

సత్యవేడు, మే 15: చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకాహషి మునియో బుధవారం శ్రీసిటీని సదర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం శ్రీసిటీలోని జపనీస్ పరిశ్రమల అసోసియేషన్ సభ్యులతో కాన్సుల్ జనరల్‌సమావేశమై చర్చించారు.ఇసుజు, ఐసన్, టీహెచ్‌కే, పరిశ్రమలను సందర్శించి, అక్కడ పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు.

చిన్నపాండూరు ఆస్పత్రిలో వైద్య సేవలు మృగ్యం

వరదయ్యపాళెం, మే 15: మండలంలోని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మృగ్యంగా మారుతున్నాయి. ఇది పేరుకే 24 గంటల ఆస్పత్రి అయినా సాయంత్రం ఆరు దాటితో వైద్య సేవలు అందడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. గతంలో ఆస్పత్రిలో ముగ్గురు వైద్యాధికారులు ఉండేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇద్దరినే పరిమితం చేయడంతో సాయంత్రం తరువాత ఆస్పత్రిలో ఎవరూ ఉండడంలేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పాముకాటు, విష పురుగుల కాటు, గర్భిణులు, ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులు ఆస్పత్రికి వస్తుంటారు. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో సకాలంలో చికిత్స అందడంలేదు. పలుమార్లు స్థానికులు, బాధితులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు స్పందించి చిన్నపాండూరు ఆస్పత్రిలో రాత్రి వేళల్లో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం


రామమందిర నిర్మాణానికి పూజలు చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మే 15: పట్టణంలోని గాండ్లవీధిలోని పురాతన సీతారాముల ఆలయ పునర్నిర్మాణ పనులను బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులతో కలిసి పునర్నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గాండ్ల సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, పాలమంగళం రవి, గణేష్, పుత్తూరు సురేష్, విజయశేఖర్, చంద్రశేఖర్, మునిలక్ష్మి, లక్ష్మీ గీత, దేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు

బుచ్చినాయుడు కండ్రిగ, మే 15: మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లకు బుధవారం ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి, లైన్ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, లైన్‌మెన్ మునస్వామి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడంతో లోఓల్టేజ్ సమస్య ఉత్పన్నమవుతోందని, దీంతో మరమ్మతులు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఉపాధి పనుల వద్ద నీరు, నీడ కల్పించండి

బుచ్చినాయుడు కండ్రిగ, మే 15: వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి పనుల వద్ద కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ సౌకర్యాలతో పాటు ప్రథమ చికిత్స బాక్స్‌ను అందుబాటులో ఉంచాలని అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో బానుప్రియ, టెక్నికల్ అసిస్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో

వడమాలపేట, మే 15: ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన వడమాలపేట మండల పరిధిలో బుధవారం జరిగింది. కాయంపేట నుంచి వడమాలపేటకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఎస్టీ కాలనీ వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వడమాలపేట, మే 15: మండలంలోని ఎస్‌బీఆర్ పురంలో పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారుగా 150 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు బాలకృష్ణ, ప్రవీణ్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రవిరాజు, యుగంధర్ రాజు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అంతుచిక్కని ఓటరు నాడి

- గెలుపుపై టీడీపీ ధీమా
- ఆశల పల్లకిలో వైసీపీ
- సైలెంట్ ఓటింగ్‌పై మల్లగుల్లాలు

పుత్తూరు అర్బన్, మే 15: ఎన్నికల సంగ్రామం పూర్తయ్యింది. ఓటరు తీర్పు ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తం అయింది. నగరి నియోజకవర్గంలో ఓటరు నాడి ప్రధాన పార్టీలకు అంతు చిక్కడం లేదనే మాటలు వినబడుతున్నాయి. గెలుపుపై టీడీపీ ధీమా వ్యక్తం చేస్తుండగా, వైసీపీ ఆశల పల్లకిలో ఊరేగుతోంది. సోమవారం రాత్రి వరకు జరిగిన పోలింగ్ తమకే అనుకూలమని ఇరు పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి. పోలింగ్ సరళిని అంచనా వేస్తూ విజయావకాశాలను అంచనా వేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ప్రధానంగా మహిళా ఓటర్లు ఈ దఫా సైలెంట్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. గతంలో ఏ పార్టీకి ఓటేసింది పోలింగ్ తరువాత చెప్పుకునే మహిళలు ఈసారి మాత్రం గుంభనంగా ఉండడం, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల మహిళా ఓటర్లు ఎటు వైపు మొగ్గుచూపారనే విషయంపై ప్రధాన పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచుతుందోననే మీమాంస నాయకుల్లో కొట్టిచ్చినట్లు కనబడుతోంది.

గెలుపుపై టీడీపీ ధీమా

గత రెండు ఎన్నికలతో పోలిస్తే ఈసారి తమకు గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని టీడీపీ అంచనా వేస్తోంది. గత ఎన్నికల్లో 87.09 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ సారి కూడా ఇంచుమించు అదేస్థాయిలో 87.08 శాతం నమోదైంది. అయితే ఓటరు తీర్పు తమకు అనుకూలంగా వస్తుందనే ధీమా టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత తోడు సిట్టింగ్ ఎమ్మెల్యే రోజా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, రెండు దఫాలు ఆమెకు అవకాశం కల్పించిన నియోజకవర్గ ఓటర్లు ఈ దఫా మార్పు కోరుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వైసీపీలో కీలక నాయకులు ఎన్నికలకు ముందు టీడీపీ కండువా కప్పుకోవడం కూడా తమకు కలిసి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రచారం మొదలుకుని పోల్ మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో టీడీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో ఆధిపత్యం కనబరిచాయి. దీనితో పాటు నియోజకవర్గంలో బలమైన ఓటు బ్యాంక్ ఉన్న పవర్‌లూమ్స్ వర్గాలకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ఆ వర్గాల్లో వార్ వన్ సైడ్ అయ్యేందుకు దోహదం చేసిందని అంతర్గత చర్చల్లో వినిపిస్తోంది.

ఆశల పల్లకిలో వైసీపీ

సంక్షేమ పథకాల లబ్ధిదారులు, ఎస్సీ, ఎస్టీ ఓటర్లుతో పాటు ఓటుకు రూ.రెండు వేలు తమను విజయతీరాలకు చేర్చుతుందని వైసీపీ శ్రేణులు ఆశల పల్లకిలో ఊరేగుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత మహిళలు తమకు అనుకూలంగా ఓటేశారని చర్చించుకుంటున్నారు. అయితే గత ఎన్నికల్లో డ్వాక్రా రుణమాఫీ హామీ మహిళా ఓటు బ్యాంక్ వైసీపీకి టర్న్ కావడంలో కీలక పాత్ర పోషించింది. గత ఎన్నికల్లో పురుషుల కన్నా 2814 ఓట్లు మహిళలు అధికంగా ఓటు వేశారు. దీంతో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రోజా 2,708 స్వల్ప ఓట్ల మెజార్టీతో గట్టెక్కింది. అయితే ఈ దఫా వైసీపీ మేనిఫెస్టో చప్పగా ఉండడంతో డ్వాక్రా సంఘాల మహిళలను నిరుత్సాహపరిచినట్లు సమాచారం. పైగా విపరీతంగా పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలపై పేద, మధ్య తరగతి వర్గాలు వైసీపీ ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నట్లు నియోజకవర్గంలో చేపట్టిన పలు సర్వేలు తేటతెల్లం చేశాయి. రెండు దఫాలు ఎమ్మెల్యేగా గెలవడానికి దోహదం చేసిన వడమాలపేట మండలంలో ఈసారి టీడీపీ అనూహ్యంగా పుంజుకుంది.

క్రాస్ ఓటింగ్ భయం

ఇదిలా ఉండగా ప్రధాన పార్టీలను క్రాస్ ఓటింగ్ భయం కుంగదీస్తోంది. అసలే అత్తెసరు మెజార్టీతో గెలిచే సీటు కావడంతో క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచుతుందనే ఆందోళన ఇరుపార్టీల్లోను వ్యక్తమవుతోంది. రెండు పార్టీల నుంచి తాయిలాలు అందుకున్న ఓటర్లు ఒక ఓటు అటు, మరొక ఓటు ఇటు వేసి ఉంటే ఆ ప్రభావం ఎవరి విజయావకాశాలను దెబ్బతీస్తుందనే చర్చ సాగుతోంది. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో సైలెంట్ ఓటింగ్ గెలుపును నిర్దేశించనుందనే అభిప్రాయాలను రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. అంచాలు ఎలా ఉన్నా తుది ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీ వరకు ఆగక తప్పదు. అప్పటి వరకు జరిగే చర్చ మొత్తం స్పెక్యులేషనే.